క్లుప్తంగా

పారిశుధ్య పనులు పరిశీలన



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమీషనర్

కోరుట్ల: పట్టణంలోని పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ సోమవారం పరిశీలించారు. వివిధ వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనుల వద్దకు వెళ్లి సిబ్బందికి పలు సూచనలు చేశారు.డ్రెయినేజీల వద్ద చెట్ల పొదలను తొలగించారు. పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు వందరోజులు పని కల్పించాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్యాల: ఉపాధి హామీ కూలీలకు వంద శాతం పని కల్పించాలని ఎంపీడీవో వెంకటేశం అన్నారు. మండలంలోని మానాలలో సోమవారం ప్రారంభమైన జాతీయ ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వేంకటేశం సందర్శించారు. కూలీలతో మాట్లాడారు. కూలీల హాజరుశాతం పరిశీలించారు. కూలీలకు వంద దినాలు పని కల్పించాలని సూచించారు. కూలీలు ఎక్కువ మంది పనికి వచ్చేలా ప్రోత్సహించాలని ఎంపీడీవో ఆదేశించారు. ఎంపీడీవో వెంట టెక్నికల్ అసిస్టెంట్ లావణ్య తదితరులు ఉన్నారు.

రాయికల్ ఠాణాలో ఓపెన్ హౌస్



ఆయుధాలపై విద్యార్థులకు వివరిస్తున్న ఎస్సై

రాయికల్: పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాయికల్ ఠాణాలో ఎస్సై ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఠాణాలో ఆయుధాలపై పోలీసుల విధులు, పౌరులు పొందాల్సిన సేవలపై వివరించారు.కార్యక్రమంలో హెచ్ఎం బాలె శేఖర్, డైరెక్టర్ నిఖిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



ఎంపీపీకి కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో సోమవారం ఇబ్రహీంపట్నం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కరీంనగర్‌లోని రేకుర్తి వైద్యులు 118 మందికి కంటి పరీక్షలు చేయగా, 58 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి, 30 మందిని ప్రత్యేక బస్సులో రేకుర్తికి తరలించారు. రెండో విడతలో మరో 28 మందిని పంపిస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ సోమ ప్రభాకర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి రెబ్బటి రాజశేఖర్‌యాదవ్, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కసుక సంజీవ్ అన్నారు. లయన్స్ క్లబ్ కంటి వైద్య శిబిరానికి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలన్నారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకునేవారు ఈ శిబిరానికి తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డులు, గ్లాసు, ప్లేటు, చద్దర్లు తీసుకుని రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజనల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, మండల కార్యదర్శి తోట రాజరెడ్డి, కోశాధికారి ఇర్రి జైపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల గుర్తింపునకు కసరత్తు

- ఎంప్లాయిమెంట్ కార్డుల పెంపునకు నిర్ణయం
- కళాశాలల్లో స్పెషల్ డ్రైవ్‌కు అధికారులు ప్రణాళిక
- ఉద్యోగాల దరఖాస్తుకు సులభం



కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు

కథలాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎంత మంది ఉన్నారు, వారి అర్హతలు నమోదు చేసి ఉపాధి, ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. దీని కోసం ఎంప్లాయిమెంట్ కార్డు పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ కార్డు పొందితే విద్యా నేపథ్యం, అనుభవం ఆధారంగా అర్హత కలిగిన అభ్యర్థులకు ఉపాధి సహాయాన్ని అందిస్తుంది. పోర్టల్‌లో యువత విద్యార్హత, మార్కులు, కుల ఆదాయం ధ్రువీకరణ పత్రాలు పొందుపరుస్తారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ ప్రకటనలకు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాల్సిన అవసరం లేకుండా కేవలం ఎంప్లాయిమెంట్ కార్డుద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.

ప్రయోజనాలు ఇలా..

పదో తరగతి పూర్తయినవారు ఎంప్లాయిమెంట్ కార్డు పొందవచ్చు. ఆ తర్వాత ఇంటర్ ఆపై విద్యనభ్యసిస్తే రెన్యూవల్ చేసుకోవాలి. కార్డులో నమోదు చేసుకున్న అభ్యర్థులకు వారి ఉత్తీర్ణత ప్రకారం ఉద్యోగమే కాకుండా ప్రభుత్వం, ఇతర సంస్థలు నిర్వహించే వివిధ పోటీ పరీక్షల శిక్షణకు అర్హులుగా నిర్ణయించారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి రిజిష్టర్ సభ్యుల జాబితా, ఉద్యోగ అనుభవం ఆధారంగా పోస్టులను విడుదల చేస్తున్నారు. అందుకే ఉపాధి కార్డుల సంఖ్య పెంపుపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు.

జిల్లాలో 9,671 మందికి ఎంప్లాయిమెంట్ కార్డులు

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా 380 గ్రామాలున్నాయి. ఇప్పటికే జిల్లాలో 9,671 మంది ఎంప్లాయిమెంట్ కార్డులు పొందారు. ఇందులో పదోతరగతి పూర్తయిన వారు 1,619 మంది, ఇంటర్ పూర్తయిన వారు 1,935 మంది, డిగ్రీ పూర్తయినవారు 4,785 మంది ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. ఈ కార్డు పొందేందుకు మీసేవ కేంద్రాల ద్వారా రూ. 300 నుంచి రూ. 500 వరకు ఖర్చు అవుతుండటంతో ఎక్కువ మంది వెనుకడుగు వేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతీ ఏటా పదో తరగతి పూర్తయిన విద్యార్థుల సంఖ్య పది వేలు ఉండగా.. ఎంప్లాయిమెంట్ కార్డు కోసం నమోదు చేసుకునే వారి సంఖ్య మాత్రం అంతగా ఉండటంలేదు. అందుకే జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ కార్డుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు జిల్లా అధికారులు పేర్కొన్నారు.

ఎంప్లాయిమెంట్ కార్డు కోసం కావాల్సిన సర్టిఫికెట్లు

- ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ మెమో, మార్కుల షీట్
- డిగ్రీ ప్రొవిజినల్ మార్కుల మెమో
- పీజీ సర్టిఫికెట్
- స్కాన్ చేసిన పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, సంతకం
- ఒరిజినల్ కుల సర్టిఫికెట్
- ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు స్కాన్ చేసినవి

ఉపాధి అవకాశాలు కల్పిస్తే యువతలో ఆసక్తి



ఎంప్లాయిమెంట్ కార్డు ఉన్నవారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే పదోతరగతి పూర్తి కాగానే ఎంప్లాయిమెంట్ కార్డు పొందాలని ప్రతీ ఒక్కరిలో ఆసక్తి ఉంటుంది. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు దరఖాస్తు కోరుతున్న సంస్థ ప్రతినిధులు నేరుగా దరఖాస్తులు తీసుకుని పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు. ఉద్యోగాలు భర్తీ చేసేటప్పుడు ఎంప్లాయిమెంట్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే దానికి ప్రాధాన్యత ఉంటుంది.

– యాగండ్ల రమేశ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

వినియోగించుకోవాలి



ఉపాధి కార్డులతో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. నిరుద్యోగ యువత ఈ విషయాన్ని గమనించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. తప్పనిసరిగా ఉపాధి కార్డు తీసుకోవాలి. విద్యార్హత పెరిగినట్లయితే వెంటనే రెన్యూవల్ చేసుకోవాలి.

– సత్తమ్మ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, జగిత్యాల

రైతుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్‌సంఘ్ మండల అధ్యక్షుడు క్లోం మహిపాల్ అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసీల్దార్ రవీందర్‌కి ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి రైతులు పండించిన ధాన్యాన్ని తప్ప, తాలు పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. కాంట జరిగిన వెంటనే రైతులకు తక్‌పట్టి ఇవ్వాలని, ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగానే కొనుగోలు జరుపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ క్యాతం మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుపై నిజామాబాద్ ఎంపీ, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అరవింద్ నిరాధార ఆరోపణలు చేయటం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు.దళితబంధు, బీసీ బంధు, డబుల్‌బెడ్ రూం ఇళ్ల పథకాల్లో ఎమ్మెల్యే కమీషన్లు తీసుకున్నారని ఎంపీ అరవింద్ ఆరోపణలను ఖండించారు. ప్రతీ పథకంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగానే జరిగిందన్నారు. ఆధారాలు లేకుండా పిచ్చిపిచ్చి ఆరోపణలు చేయటం ఎంపీ మానుకోవాలని, సహించేదిలేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, పట్టణ,మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అన్నం అనిల్,దారిశెట్టి రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విషపు చెట్ల నుంచి గ్రామస్తులకు విముక్తి



కొమ్మలు తొలగించిన పంచాయతీ సిబ్బంది

వెల్గటూర్: విషపు చెట్ల బారి నుంచి గ్రామస్తులకు విముక్తి కలిగింది. వెల్గటూర్ మండల కేంద్రంలోని కోటిలింగాల కమాన్ వద్ద ఏపుగా పెరిగిన ఏడాకుల పచ్చని పాలచెట్లు ఈ సీజన్‌లో ఒకేసారి పుష్పించి సువాసనలు వెదజల్లుతూ అందరికీ ఆహ్లాదాన్ని పంచుతాయి. కానీ డెవిల్ ట్రీగా పిలువబడే ఈ చెట్ల నుంచి వెలువడే ఘాటైన వాసన పీల్చడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు, శ్వాసకోశ సమస్యలు, కిడ్నీ జబ్బులు, శరీరంపై దద్దుర్లు లాంటి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి. ఈ చెట్ల నుంచి రాత్రి పూట వెదజల్లే ఘాటైన వాసనల వల్ల పరిసర ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన అధికారులు సోమవారం పంచాయితీ సిబ్బందితో చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. తాత్కాలికంగా కాకుండా పూర్తి స్థాయిలో ఈ చెట్లను తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

పీహెచ్‌సీకి జ్వర బాధితుల తాకిడి

మల్యాల: మండలంలో ప్రజలను సీజనల్ వ్యాధులు వీడడం లేదు. జ్వరం, దగ్గు, జలబు వంటి సాధారణ వ్యాధులతో నిత్యం ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం మల్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు వైద్య చికిత్స కోసం తరలివస్తున్నారు. సోమవారం ఒక్క రోజే 130 మంది రోగులు వివిధ రకాల సీజనల్ వ్యాధులతో రాగా,వైద్యురాలు మౌనిక, రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. ల్యాబ్ అసిస్టెంట్ శ్రీనివాస్ 30 మంది నుంచి రక్త పరీక్షల నమూనాలు సేకరించారు.

విద్యార్థుల రాజకీయ పార్టీ వేములవాడ అభ్యర్థిగా రవి

కథలాపూర్: 'విద్యార్థుల రాజకీయ పార్టీ' వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన గుగులోత్ రవికి టికెట్ ఇచ్చినట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునిల్ సోమవారం తెలిపారు. ఏ రాజకీయ పార్టీ కూడా నిరుద్యోగులను ఆదుకోవడంలేదని, దివ్యాంగుల సమస్యల పట్ల పట్టించుకోకపోవడంతో ఈ ఎన్నికల్లో దివ్యాంగుల, నిరుద్యోగుల మద్దతుతో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు రవి తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లు తనకు మద్దతు ప్రకటించాలని కోరారు.

విద్యుత్ స్తంభం తొలగింపు

సాక్షి స్పందన

పెగడపల్లి: మండల కేంద్రం నుంచి నందగిరి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విరిగిన విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం శీర్షికన ఆదివారం వచ్చిన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని నాటారు. సమస్యను వెలికితీసిన ట్రాన్స్‌కో అధికారులను కదిలించిన సాక్షికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తెమెట్టెలు అందజేత

పెగడపల్లి: మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద యువతి వివాహానికి పుస్తె,మెట్టెలు అందజేసి ఉదారతను చాటుకున్నారు మాజీ ఎంపీటీసీ కొమురెల్లి ఆనందం. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం చిర్ర నర్సమ్మ-లచ్చయ్య కూతురు అనూష వివాహం సోమవారం జరుగగా, వివాహ వేడుకలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆనందం పుస్తె, మట్టెలతో పాటు దుస్తులను కానుకగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కోరుట్ల టౌన్: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కొరవేణి విష్ణేశ్ రాష్ట్ర స్థాయి ఖోఖో టీంకు ఎంపికయ్యాడు. కరీంనగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 విభాగం ఖోఖో పోటీల్లో పాల్గొని రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాడు. ఈ సందర్భంగా విష్ణేశ్‌ను పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్, ప్రిన్సిపాల్స్ కే.రాదాకృష్ణా, వినోద, డైరెక్టర్లు, పీఈటీలు అభినందించారు.

బంద్ ప్రశాంతం

కథలాపూర్: గ్రామకమిటీ సభ్యుల పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన కథలాపూర్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. కథలాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి చెదలు నారాయణపై దాడి చేయడాన్ని ఖండిస్తూ గ్రామకమిటీ సభ్యులు బంద్‌కు పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

జగిత్యాలరూరల్: మహిళా శిశు సంక్షేమ శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో జిల్లా మహిళ సాధికారత బృందం అంగన్‌వాడీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు మహిళా శక్తి స్కీం, బేటి బచావో, బేటి పడావో మహిళ సాధికారత 181, సఖీ 1098, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ అశ్విని, హిమశ్రీ, గౌతమి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బొమ్మెనలో గడపగడపకూ బీఆర్ఎస్ ప్రచారం



బొమ్మెనలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు గడప గడపకూ ప్రచారం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రైతులకు, మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాల ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, రొక్కం హరీశ్ రెడ్డి, చెక్కపెల్లి రాజుకుమార్, కడారి స్వామి, రాజేందర్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

జంగ్ తెలంగాణ



ఫకీర్‌కొండాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫకీర్ కొండాపూర్, ఇబ్రహీంపట్నంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి కారు గుర్తుకే ఓటు వేసి సంజయ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ గుంటి లక్ష్మి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి, బర్దీపూర్ సర్పంచ్ సంఘం సాగర్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గెలుపుకోసం దుబ్బ రాజన్నకు ముడుపు



ముడుపుకట్టి ప్రచారం ప్రారంభించిన నాయకులు

సారంగాపూర్: జగిత్యాల నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు విజయం ప్రసాదించాలని కోరుతూ పెంబట్ల-కోనాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం దుబ్బరాజేశ్వరస్వామికి ముడుపు కట్టారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ముడుపును కట్టి ప్రచారం ప్రారంభించారు.

జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



ఏడుమోటలపల్లిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

పెగడపల్లి: మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పెగడపల్లి, ఏడుమోటలపల్లి గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు పార్టీ అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కరుణాకర్‌రావు, స్వామి, ప్రవీణ్‌రావు, లోకేశ్, లక్ష్మీనారాయణ, రాజిరెడ్డి, తిరుపతినాయక్, లచ్చయ్య, మాధవరెడ్డి పాల్గొన్నారు.

'అడ్లూరి' గెలుపునకు విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్గటూర్: కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలుపు కోసం వెల్గటూర్ మండల కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సంకెనపెల్లి లో గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని, మంత్రి కొప్పుల ఈశ్వర్ హయాంలో కేవలం తన అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే బాగుపడ్డారని, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను గెలిపిస్తే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఒక్కసారి లక్ష్మణ్ కుమార్‌కు అవకాశం కల్పించాలని కోరారు.

వడ్డెరులపై దాడులు అరికట్టాలి



రాజేశ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

మల్లాపూర్: నిరుపేద వడ్డెరులపై దాడులను అడ్డుకట్ట వేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని వడ్డెర సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లెపు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లిలో సర్పంచ్, అతని అనుచరులు దాడి చేసిన యువకుడు పల్లపు రాజేశ్‌ను సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వీధిబల్బులు రావడం లేదని అడిగినందుకు అధికార పార్టీ సర్పంచ్, అతని అనుచరులు రాజేశ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం దారుణమన్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.వెంటనే నిందితులపై కేసు పెట్టి కఠినంగా శిక్షించాలనిచ లేని పక్షంలో డీఎస్పీ,ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వడ్డెర నాయకులు మక్కల ప్రవీణ్, బోదాసు నర్సారెడ్డి, అల్లెపు నరేశ్, బొంత రమేశ్, రాకేశ్, సాయిలు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన వాసరి మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా 1993-94లో రాయికల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం రూ.55 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కడకుంట్ల జగదీశ్వర్, బోగ రాము, వేల్పుల గంగరాజం, వాసం దిలీప్, పల్లికొండ గంగాధర్, జలేందర్, రవీందర్, శేఖర్, రాము పాల్గొన్నారు.

రాగోజిపేటలో బీజేపీ సమావేశం

మేడిపల్లి: భీమారం మండలంలోని రాగోజిపేటలో సోమవారం బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించింది. బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకులకు ఎన్నికల సన్నద్ధతపై సలహాలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో-కన్వీనర్ క్యాథం దశరథరెడ్డి, వెంకట్రావుపేట సర్పంచ్ జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గోపా' నూతన కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) మెట్‌పల్లి మండల కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుద్దాల రాజేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ప్రణయ్‌గౌడ్, నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌గౌడ్, కోశాధికారిగా రవీందర్‌గౌడ్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా వెంకటేశ్‌గౌడ్, హరిక, సంయుక్త కార్యదర్శులుగా విక్రమ్‌గౌడ్, ప్రసన్నగౌడ్,కార్యవర్గ సభ్యులుగా భానుప్రసాద్, అనూష, రమేశ్, కృష్ణవేణి, అభినవ్, ఆనంద్‌గౌడ్, గౌరవ సలహాదారులుగా జగదీశ్వర్‌గౌడ్, నర్సయ్యగౌడ్, వెంకటేశ్వర్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు.